క్లుప్తంగా

ఘనంగా కూడారై సేవ



ఆలయంలో కూడారై సేవ

సాలూరు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పెదకోమటిపేట రామాలయంలో బుధవారం కూడారై సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సేవకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

300మంది మహిళలకు చీరల పంపిణీ



చిలకలపల్లిలోని వంతరాం ఎస్సీ కాలనీలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని వంతరాం ఎస్సీ కాలనీలో 300మంది మహిళలకు ఎమ్మెల్యే జోగారావు తన సొంత నిధులతో చీరలు, రూ.500 వంతున నగదు బుధవారం పంపిణీ చేశారు. క్రిస్మస్ సందర్భంగా వచ్చి పంపిణీ చేయాలనుకున్నా ఆసమయానికి రాలేక ఇప్పుడు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల సన్యాశి నాయుడు, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ,, బి.సత్యనారాయణ, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు



ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం

పార్వతీపురంటౌన్: ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11,12,18,19 తేదీల్లో పోలీసు స్టేషన్ కార్యాలయ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను నవీకరించడం, ఆధార్ కార్డులో ఉన్న తప్పులు సవరించుకోవడానికి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఈ క్రాప్ ఆధారంగా ధాన్యం సేకరణ



సీపీఎం, రైతు సంఘం నాయకులతో మాట్లాడుతున్న పౌరసరఫరాల జిల్లా డిపో మేనేజరు నాయక్

సీతానగరం: మండలంలోని రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేయాలని కోరుతూ అంటిపేట ఆర్బీకే వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిచేలు నూర్పిడి చేసి ధాన్యం విక్రయానికి సిద్ధం చేసి నెలరోజులు గడిచినా తరలించే లారీలు రాక పోవడంతో రైతులు పడుతున్న అవస్థల కారణంగా ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. సమాచారం మేరకు పౌరసరఫరాల జిల్లా డిపో మేనేజరు డీఎం నాయక్ వచ్చి అంటిపేట ఆర్బీకే పరిధిలో రైతుల ధాన్యానికి సరిపడా లారీలు పంపించడానికి ఏర్పాటు చేయడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటుదాసు, మండల రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సాలూరు:

పట్టణంలోని పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా చేసిన విద్యార్థుల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. పట్టణంలోని రవీంద్రభారతి, లయన్స్‌క్లబ్, వెంకటవిద్యాగిరి తదితర పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది.

అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

- ఎమ్మెల్యే జోగారావు



వంతరాంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ప్రతి ఇంటా సంక్షేమ పథకాలను అందిస్తూ, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తూ సీఎం జగన్‌హన్ రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలం వంతరాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందినదీ లేనిదీ తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. సంక్షేమ పథకాలే కాకుండా గ్రామస్థాయి నుంచి అభివృద్ధి ఫలాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. గ్రామాలలో ప్రజలు చెప్పే చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్నప్పుడు అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందుకోని వారు ఉంటే దానికి కారణాలు తెలుసుకుని సమస్యను పరిష్కరించేదిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని చెప్పారు.

నిర్లక్ష్యం వద్దు

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో వ్యవహరించి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో విఫలమైతే సహించేది లేదని హెచ్చరించారు. పథకం వర్తించకపోతే ఎందుకు వర్తించలేదో తెలియపరచాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని హితవు పలికారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలసన్యాశినాయుడు, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బి.సత్యనారాయణమూర్తి, సర్పంచ్‌లు సుందరరావు, కె.మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.పకీరునాయుడు, టి.ప్రసాదరావు, కె.వెంకటరమణ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి

- ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు ఐటీడీఏ పీఓ సంక్రాంతి శుభాకాంక్షలు



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: సమష్టిగా సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం రాజన్న దొరను పట్టణంలోని ఆయన గృహంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పరిధిలోని అంశాలపై వారిద్దరూ చర్చించారు. అందులో భాగంగా ఆంధ్రా, ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాలతో పాటు జిల్లాలోని అర్హులందరికీ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అందేలా చేయడం, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల మంజూరు, రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై సంభాషించారు. ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ హౌసింగ్ ప్రత్యేకాధికారి కూడా అయిన నేపథ్యంలో పట్టణంలో ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాజన్నదొర సూచించారు. మంజూరైన ఇళ్లన్నింటికీ పునాదులు పూర్తయ్యాయని, నిధులు వెనక్కి మళ్లకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జాయింట్‌కలెక్టర్, తాను అందరు అధికారులు సమన్వయంతో మీ ఆదేశాలు, సూచనలు,సలహాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా సర్వతోముఖాభివృధికి కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ ఈ సందర్భంగా రాజన్నదొరకు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరతో మాట్లాడుతున్న జేఈ రఘు



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోరేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలో శాశ్వత ప్రాతిపాదికన పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కోసం సంక్రాంతి పండగ సందర్భంగా సంవత్సర కాలానికి సరిపడే వస్తువులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కో మహిళా కార్మికురాలికి మూడు ఖద్దరుచీరలు, 12 సబ్బులు, 6కొబ్బరినూనె డబ్బాలు, పురుషులకు ఏకరూప దుస్తులు, దుప్పట్లు, సబ్బులు, కొబ్బరినూనె చొప్పున 38మంది కార్మికులకు అందజేసినట్లు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో శాశ్వత కార్మికుల సంక్షేమం కోరి వారి ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తుందని స్పష్టం చేశారు. కార్మికులకు ఇచ్చిన వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, కమిషనర్ జె.రామప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోండి

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, జాతీయ రహదారిపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను ఎన్‌హెచ్ 26 జేఈ రఘు కలిశారు. ఈ సందర్భంగా రహదారి పనులపై వారిద్దరూ చర్చించారు. ఈ క్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ, వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల పలుమార్లు రోడ్డు గోతులు పడి మరమ్మతులకు గురైనట్లు గుర్తుచేశారు. ఇది పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనిపై జేఈ మాట్లాడుతూ, ఈ పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు.ప్రస్తుతానికి రోడ్డు మీద నీరు నిల్వ ఉండకుండా ఆలయం పక్కనుంచి కాలువల ద్వారా వెళ్లిపోయేలా కాలువల నిర్మాణం చేపడుతున్నామని, రోడ్డు ఎత్తుచేస్తున్నామని వివరించారు.

పీఎం శ్రీ పథకం పాఠశాలల పరిశీలన



పాచిపెంటలో పాఠశాలను సందర్శించిన పీఎంశ్రీ స్టేట్‌టీం అధికారులు

పాచిపెంట/మక్కువ: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికైన పాఠశాలలను పీఎంశ్రీ స్టేట్‌టీం అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ మేరకు సాలూరు నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట మండలాల్లో పలు పాఠశాలలను పరిశీలించి మాట్లాడుతూ కేంద్రియ విద్యాలయాలు, నవోదయ, మోడల్ పాఠశాలలు, కేజీబీవీ, గురుకులం, జెడ్పీ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం అమలుచేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వపాఠశాలలను తీర్చిదిద్దేందుకు 2022–23 సంవత్సరం నుంచి, 2026–27 వరకు దశల వారీగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రీన్‌స్కూల్స్, పాఠశాలల ఆవరణలో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు, సేంద్రియ విధానంతో తోటల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన, విద్యలో గుణాత్మకమైన మార్పులపై శిక్షణ ఇవ్వడం , విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డిజిటల్ శిక్షణ ఇవ్వడం, సైన్స్‌ల్యాబ్‌లు, లైబ్రరీలు ఏర్పాటు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎంఈవో పి.జోగారావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి చర్యలు



ఆర్టీసీ ఎం.డి తిరుమలరావును కలిసిన టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్(ఫైల్)

పార్వతీపురం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని వినియోగిస్తే ఈప్రాంతం అభివృద్ధి చెందేందుకు ఎంతో అవకాశం ఉంటుందని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధిపై ఆర్టీసీ ఎం.డి ద్వారకా తిరుమలరావును ఇటీవల తాను కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో షాపింగ్ మాల్ నిర్మాణంపై చర్చించినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆర్టీసీ ఎం.డి సానుకూలంగా స్పందించి గడిచిన ఏడాది నవంబర్‌లో జరిగిన ఆయన పర్యటనలో పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారన్నారు. మెగా కాంప్లెక్స్ ఏర్పాటైతే ఈ ప్రాంతం వాణిజ్య పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయ పడ్డారు.

200 సారా ప్యాకెట్ల స్వాధీనం

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామ శివారులో ఓ వ్యక్తి నుంచి 200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు బుధవారం తెలిపారు. అలాగే పెదశాఖ గ్రామంలో మరో వ్యక్తి దగ్గర నుంచి 20 లీటర్ల సారా గుర్తించి, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రుణాల రికవరీ వేగవంతం చేయాలి

భామిని: ఎస్‌హెచ్‌జీకు ఇచ్చిన రుణాల రికవరీని వేగవంతం చేయాలని వెలుగు ఏపీఎం దొడ్ల భవాని సూచించారు. బుధవారం మండలంలోని మనుకొండ గ్రామైక్య సంఘ కార్యాలయంలో స్వయం సహాయక గ్రూపులతో సమావేశమైన ఆమె శ్రీనిధి రుణాలు విధిగా వసూలు చేయాలన్నారు. రుణాల రికవరీ జరిగితేనే మరో సంఘానికి ఆర్థికసాయం చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీసీ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి



ఫోలిక్‌యాసిడ్ మందు వేయడాన్ని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు

సీతానగరం: చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణకు వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు బుధవారం కృష్ణారాయపురంలో పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ ఎం రాధాకాంత్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది చిన్న పిల్లలకు ఐరన్ సిరప్ వేస్తున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. అనంతరం కృష్ణారాయపురం, పెదంకలాం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు వైద్య సిబ్బంది వేస్తున్న ఐరన్ సిరప్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రతి వారంలో రెండు సార్లు ఐరన్ సిరప్‌లను క్రమం తప్పకుండా వేయాలని తద్వారా పిల్లల్లో రక్తహీనత నివారణ, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహపడుతుందన్నారు. అదేవిధంగా ప్రతినెలా నమోదు చేస్తున్న పిల్లల బరువు, ఎదుగుదలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అన్నంనాయుడు, సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందించాలి



లక్ష్మీపురంలో సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

సీతానగరం: ప్రతి ఒక్కరికీ అర్హత కొలమానంగా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందజేయాలని అధికారులను కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండలంలోని లక్ష్మీపురం, బూర్జ గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను పాటించాలని సూచించారు. గ్రామ సచివాలయం పరిధిలోని పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను అడిగి తెలుసుకున్నారు.

ఇళ్ల నిర్మాణంపై సంతృప్తి

ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలపై ఆరా తీసిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాల గోడపై జగనన్న తోడు, అమ్మ ఒడి, జగనన్న కానుక, వైఎస్సార్ అసరా తదితర లక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా లేకపోవడాన్ని గుర్తించి తప్పనిసరిగా లబ్ధిదారుల వివరాలు సచివాలయంలో ప్రదర్శించి వారికి కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, ఈ క్రాప్ నమోదు, తదితర అంశాలను పరిశీలించారు. గ్రామాల్లో పౌష్టికాహార లోపం, బరువు తక్కువ ఉన్న చిన్నారుల వివరాలను అంగన్వాడీ కేంద్రంతో పాటు, సచివాలయంలో కూడా పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, ఈఓ పీఆర్డీ కె.కుమావర్మ, లక్ష్మీపురం, బూర్జ గ్రామాల సర్పంచ్‌లు టి సత్యవతి, జి దాసు, గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు పి.వెంకటనాయుడు, టి. శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ శంకర్రావు, సచివాలయ సిబ్బంది, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై రైతుల ఆసక్తి



పెద్దూరులో వేసిన పెసర పంట

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పెసర, మినుము వంటి అపరాల పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. వరి కోతల అనంతరం వాతావరణం అనుకూలంగా ఉండడంతో చాలాచోట్ల వేసిన పెసర, మినుము పంటలు ఆశాజనకంగా ఉన్నాయి.

కిక్కిరిసిన వారపు సంత



జనాలతో కిక్కిరిసిన వారపు సంత

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారపు సంత జనాలతో కిక్కిరిసింది. సంక్రాంతి పురస్కరించుకుని, పూజ, ఇతర సామగ్రి కొనుగోలు కోసం జనాలు ఒక్కసారిగా సంతకు పోటెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది.

కల్యాణ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



నివేదనకు సిద్ధం చేసిన గంగాళాలు

పార్వతీపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు జగన్నాధాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు కూడారై సేవ, 108 గంగాళాలతో నివేదన సమర్పించారు. వేకువజామున సుప్రభాతం, అర్చన, తోమాలసేవ, గోదా తాండవ కృష్ణుల అర్చన, హారతి, నీరాజన మంత్ర పుష్పాలతో కార్యక్రమాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

యువత స్వయం ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ శాఖ ఆర్టీఓ హేమసుందర్

పార్వతీపురం టౌన్: యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, దీనిలో భాగంగానే ప్రధానమంత్రి ఉపాధికల్పన కార్యక్రమం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలని పీఎంజీఈపీ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, ప్రకృతి వ్యవసాయ ఆర్టీఓ హేమసుందర్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ సమన్వయంతో రైతు, యువతతో సమావేశాన్ని నిర్వహించారు. పీఎంజీఈపీ ద్వారా అందజేస్తున్న రుణసౌకర్యం, పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల సాగుపై విస్తృత అవగాహన రైతులకు కల్పించి ప్రకృతి వ్యవసాయం విస్తరణ పెంచాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం సాగుచేసే రైతులు పీఎంజీఈపీ అందజేస్తున్న సబ్సిడీ రుణాలు, ఆర్థికసాయం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవధాన్యాల సాగువల్ల భూసారం, సేంద్రియ కర్బనం శాతం పెరిగి ప్రధాన పంటల్లో ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఎ.డి సీతారాం, లీడ్ బ్యాంక్‌మేనేజర్, ఖాదీ బోర్డు డైరెక్టర్ రవి, వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయం డీపీఎం షణ్ముఖరాజు, అదనపు డీపీఎం ధనుంజయ, జట్టు సంస్థ అధినేత డొల్లు పారినాయుడు, వ్యవసాయసలహామండలి సభ్యుడు చిన్నారావు, ప్రకృతివ్యవసాయ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.